# పడిలేచిన కెరటం

## – గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

“**ఆ మర్నాడు** వాళ్ళతో రానని గొడవ పెట్టాను. ఏడ్చాను.లాభం లేకపోయింది. నాలుగు సార్లు బతిమాలించుకున్నాకా వాళ్ళతో వస్తానన్నాను. కానీ కోపంగానే ఉన్నాను. పది గంటలకి ముగ్గురం డాక్టరు క్లినిక్ కి వెళ్ళాం. బిజీగా ఉన్న రోడ్లో ఓ నాలుగు అంతస్థుల భవనం లో ఆమె క్లినిక్ ఉంది. కింద అన్నీ దుకాణాలు అవి తెరిచీ ఉన్నాయి. పైన అన్నీవరసగా డాక్టర్ల క్లినిక్ లు. మెడికల్ షాపులు ఉన్నాయి అందులో ఒకటి డాక్టర్ శిఖా క్లినిక్ . అది ఓ మళ్గీ.దాని షట్టర్ పూర్తిగా పైకి ఎత్తీ ఉండడంతో ఎంట్రెన్స్ వెడల్పు గా ఉంది. ముందు అడ్డుగా ఓ చెక్క పార్టిషన్ ఉంది. ఓ మనిషి వెళ్ళేంత దారి ఉంది,

లోపలికి వెళ్ళాం. అది ఓ పెద్ద గది. దాని మధ్యలో పార్టిషన్ లాగా నీలి రంగు తెర ఉంది. కానీ అది ఓ పక్కకి లాగేసి ఉంది. అందుకని లోపల ఏం జరుగుతోందో బాగా కనపిస్తోంది.ఓ చేత్తో ఫోన్ లో మాట్లాడుతూ, మరో చేత్తో ఏదో రాస్తూన్న లేడీ డాక్టరు కనిపించారు.ఆవిడ మమ్మల్ని చూసి, కూచో మన్నట్టు తల ఊపుతూ చేత్తో సైగ చేసింది.. ఓ పక్కకి చూసాం. గోడకి వైపున వరసగా నాలుగు తెల్ల ప్లాస్టిక్ కుర్చీలున్నాయి. ఓ మూల టీపాయ్ ,దానిమీద రెండు పేపర్లున్నాయి. దంతం రంగు గోడల మీద అందంగా ఉన్న పెయిటంగ్ లున్నాయి. పైన ఫాన్ మెల్లిగా తిరుగుతోంది. చాలా నీట్ గా ఉన్న క్లినిక్ అది.

మేము కూచున్న ఓ ఐదు నిమిషాలకి, ఫోన్ పెట్టేసి, తెర ని పూర్తిగా లాగి వేసేసింది. మరో రెండు నిమిషాలకి వెంటనే తెరని పక్కకి కొంచెం జరిపి,మళ్ళీ ఆమె లోపలికి వెళ్లింది. మరో ఐదు నిమిషాలు అయ్యాకా తెర పక్క నుంచి బయటికి వచ్చి, రమ్మన్నట్టుగా తలఊపి. తన టేబుల్ దగ్గరికి వెళ్తూ, మమ్మల్ని పలకరింపుగా చిన్న నవ్వు నవ్వింది.

మేము లోపలికి వెళ్ళాం. కూచోమంది. అందరం కూచున్నాం . ఆమె పేరు డా.శిఖా చోప్రా. ఆ పేరు పక్కనే ఓ రెండు డిగ్రీలు ఉన్న ఓ చెక్కముక్క ఆటేబుల్ మీద ఓ పక్కగా ఉంది. టేబుల్ మీద ఉన్న గాడు పలక కింద ఏవో రెండు ఫొటోలున్నాయి.ఆమె సన్నగా చిన్నగా, తెల్లగా, కత్తిరించిన నల్లటి జుట్టుతో చక్కగా, చెదరని నవ్వుతో మమ్మల్నే చూస్తోంది.

మేము అందరం కూచోగానే నవ్వుతూ పలకరించింది. అలా పలకరించడం ఆమె వృత్తి. అది ఆమె ప్రొఫెషన్. ఆ నవ్వు,ఆ మాటల్లోని మెత్తదనం,మంచిదనం అంతా బూటకం, పై పూత నాటకం. ఈ సంగతి నాకు తెలుసు. అందుకే ఏం అనలేదు. మౌనంగా ఉన్నాను.

నాతో ఏదో మాట్లాడింది . కానీ నేను జవాబివ్వలేదు. అయినా ఆమె నవ్వుతూనే ఉంది.

“ముందు పేరెంట్స్ గా మీరు మీ అమ్మాయితో ఎలా ఉంటారో నాకు తెలియాలి. ఆ తరవాత దానిపై మీకు కొన్ని విషయాలు చెప్పాలి, మిమ్మల్ని కొన్ని విషయాలు అడగాలి. ఏదీ దాచకుండా అన్నీ చెప్పండి ” నాన్న ఆశ్చర్యంగా ,కొంచెం ఆందోళనగా చూసారు.

అమ్మ భయంగా చూసింది. నాన్న కూడా ఇంచు మించు అలాగే ఉన్నారు. ఇద్దరూ నా వైపు చూసారు. అది డాక్టర్ గమనించారు.

“శృతీ బయట కూచో ” అని ఆమె అన్నారు. నేను బయటకి వెళ్ళాను.

ఆ డాక్టరు వాళ్ళని ఏవో అడుగుతారు. నాకు తెలుసు వాళ్ళు అన్నీ అబద్దాలు చెప్తారు. నన్ను ఎంతో బాగా చూసుకుంటున్నామనే చెప్తారు. వాళ్ళ తప్పు ఏం లేదు అన్నట్లుగా జవాబులిస్తారు. వాళ్ళ మాటలు నమ్మకండి అనాలి.

ఓ పది నిమిషాలయ్యాకా నన్ను లోపలికి రమ్మన్నారు. నేను వెళ్ళి కూచున్నాను. ఆమె ఏం అడిగిందో తెలీదు కానీ చాలా సీరియస్ గా ఉన్నారు అమ్మ నాన్నగారు.

“ ముందు కొన్ని ప్రశ్నలుగా అడుగు తాను. నిజాయితీతో జవాబులివ్వండి ” అని అమ్మని చూసింది.

నేను అమ్మనే చూస్తున్నాను. ఎటువంటి జవాబులు ఆమె ఇస్తుందో, అమ్మ నా వైపు చూసింది. అది ఆ డాక్టరు అర్థం చేసుకున్నట్టుంది.

“ఓ కే, మీరు చెప్పద్దు. ఇప్పుడు మీకు ఓ పేపరిస్తాను , మీరు నిజాయితిగా దానికి జవాబులిస్తే నాకు అర్థం అవుతుంది. ఇంట్లో అమ్మాయి పట్ల మీ ప్రవర్తన ఎలా ఉంటుందో నాకు తెలుస్తుంది ” అంటూ ఆవిడ ఇద్దరికీ చేరో కాగితం ఇచ్చింది. నేను మౌనంగా వాళ్ళనే చూస్తున్నాను.

నా గురించి వాళ్లని అడగడం ఏంటీ ? అసలు మా వాళ్ళ గురించి నన్ను అడగాలి. నన్ను చెప్పమంటే బావుంటుంది. నాతో వాళ్ళెలా ఉంటారో నేను చెప్తాను. ఇంట్లో ఎలా ఉంటారో , వాళ్ళేం చేస్తారో మీకు తెలీదు. డాక్టరు గారూ వాళ్ళని రాయమనద్దు. వాళ్ళ నోటితోనే చెప్పించండి, నేను వినాలి.

నేను అన్నం తింటున్నప్పుడు కూడా సలహాలు ఇవ్వడం మానెయ్యరు. నేనేం చెయ్యాలో , ఎంత సేపు చదవాలో, ఏ సబ్జెక్ట్ కి ఎంత టైము కేటాయించాలో, ప్రిపరేషన్ ఎలా ఉండాలో, ఏం చేస్తే మార్కులు ఎక్కువ వస్తాయో ఇవే చెప్తూంటారు. నేను కనపడితే చాలు, ఇదే,నాతో మాట్లాడడానికి వేరే సబ్జెక్ట్ ఏం ఉండదు. ఎంతో కోపం వచ్చేది . అయినా ఎంతో ఒబీడియెంట్ గా ,అన్నీ అలాగే చేసాను. అది నాకెంత విసుగుని ,చిరాకుని తెప్పిస్తుందో వాళ్ళకి తెలీదు. చెప్పిందే చెప్తారు. ఒక్కోసారి కోపం కూడా వచ్చేది. అబ్బా నాకు తెలుసు మీరు అన్ని సార్లు చెప్పకండి, అని అనాలనిపిస్తుంది కానీ అనలేదు. ఒక్క మార్కు తగ్గినా అమ్మ, ఎన్ని అనేదో, అవి తిట్లు కాదు. కాని ఇంకా ఎక్కువ సేపు చదవాలి, అలా అయితేనే నీకు మెడిసిన్ లో సీటు వస్తుంది. లేకపోతే. ఏ బిఎస్సీ లో నో చేరాలి. ఒక్కోసారి నా చదువు విషయమై ఇద్దరూ వాదించుకునే వారు.

ఆఫీసు నుంచి వస్తూనే , నాన్న గారు రాగానే వేసే మొదటి ప్రశ్న, రేపు ఏదైనా పరీక్ష ఉందా, ఉంటే టిఫిన్ తినేసి, కాస్సేపు రెస్ట్ తీసుకుని, ప్రిపేర్ అయిపో , అది అయిపోతే , ఎంసెట్ మోడల్ పేపరు ప్రాక్టీసు చెయ్యి. స్టాప్ క్లాక్ దగ్గర పెట్టుకో, పర్ఫెక్ట్ గా ఉండాలి . ఇలా

ఉంటుంది మా ఇంట్లో మామధ్య సంభాషణలు, ఇరవై నాలుగ్గంటలూ చదువు, మార్కులూ ఇది నా నేపథ్యం. నా కన్నా నా చదువు మీదే ఎక్కువ ఇష్టం. ఈ అతి ప్రేమ అతి శ్రద్ధ, నాకేం ఇష్టం లేదు. ఇవన్నీ నన్నడిగితే చెప్పేదాన్ని. నన్ను రాయమంటే రాసేదాన్ని.

వాళ్ళ మీద నాకు అనుమానమే, ఉన్నదున్నట్టుగా జరిగింది జరిగినట్లుగా వాళ్ళు రాస్తారన్న నమ్మకం లేదు. రాయరు, వాళ్ళ కోణంలోంచి చూస్తూ రాస్తారు. నన్ను రాయమంటే  బావుంటుంది.

ఓ ఐదు నిమిషాల్లో ఇద్దరూ రాసి ఇచ్చేసారు. ఆవిడ వాటిని ఓసారి చూసి ఓ పక్కగా ఉంచింది. అమ్మానాన్నగారు  ఆమెనే చూస్తున్నారు,  ఏం చెప్తారో అని.వాళ్ళిద్దరిని డాక్టరు గారు చూసారు.

మధ్య మధ్యలో నాన్న, ఆమెకి నా గురించి,ఈ మధ్య కాలంలో జరిగినవి అన్నీ, రెండు సార్లు కత్తితో కోసుకోడం, ఏడవడం, అదీ ఒక దాని తర్వాత ఒకటి చెప్తున్నారు. కానీ అన్నీ చెప్పలేదు. ముఖ్యంగా పదో క్లాసులో ఉన్నప్పటి సంగతి ,వాళ్ళు చేసినది చెప్పలేదు . ఒకవేళ నన్నడిగితే నేను చెప్తానా, బహుశా చెప్పక పోవచ్చు. డాక్టరు ముందు నా వాళ్ళని నేను డిగ్రేడ్ చేయలేను. జరిగిన దాన్నివాళ్ళు ఓ విధంగా, నేనో విధంగా చెప్పం.

ఓ రెండు నిమిషాలయ్యాకా డాక్టరు నాన్నవైపు చూసింది, తలని కదిలించింది.

"నేను శృతితో కొంచెం పర్సనల్ గా మాట్లాడుతాను. మీరు కాస్త బయటికి వెళ్ళి కూచోండి. అని నెమ్మదిగా అంది " ఆమె అలా అనగానే అమ్మా నాన్న  బయటికి వెళ్ళిపోయారు.

"నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను.కి అడుగుతాను,సమాధానం చెప్తావా....".ఆమె అదే శాంత స్వరంతో అంది.

తలఊపాను.

"రాత్రి లేట్ గా పడుకుంటావా ? " అసలు నిద్రే పోను అయినా నీకెందుకూ అని అందామనుకున్నాను,

కాని అనలేదు. "అప్పుడప్పుడు " ఆమె మొహం చూడడానికి ఇష్టపడలేదు.

అక్కడితో ఆగలేదు. అన్నం సరిగా తింటావా. ఏ కూరలిష్టం. ఏది ఎక్కువ ఇష్టం. పాత జీవితం,ఏదీ వదల్లేదు. ఎన్నో అడిగింది. అన్నింటికి సమాధానంగా చిన్న చిన్న పదాలు ఇస్తూ వచ్చాను.

"ఎవర్నైనా ప్రేమించావా ?" ఉలిక్కి పడ్డాను.

అది ప్రేమో కాదో తెలీదు కాని వంశీ, ఆర్నవ్, ఇప్పుడు ప్రద్యుమ్న.  ఈ ముగ్గురూ నాజీవితంలో పదో క్లాసు,డిగ్రీలో నాకు దగ్గరగా వచ్చిన వాళ్ళు. ఇప్పుడు వంశీ ఐఐటీ చెన్నై లో ఉన్నాడు ,ఆర్నవ్ ఈ లోకంలోనే లేడు. ప్రద్యుమ్నకి  నా కన్నా,  నా కవితలు సాహిత్య పరిజ్ఞానం అంటే ఇష్టం. కానీ ఇవన్నీ ప్రేమ లోకి కావు. ఒకవేళ వచ్చినా ఆమెకి ఎందుకు చెప్తాను ? అబద్ధం చెప్పాలి. ఆమెకి నా స్నేహాల గురించి ఎందుకు చెప్పాలి ? ఒక వేళ చెప్తే, ఆమె ఏం చేస్తుంది ?ముందు అమ్మా వాళ్ళకి చెప్తుంది. వాళ్ళు నన్ను నిలబెట్టి, మళ్ళీ ఇంట్లో పెద్ద సినిమా తీస్తారు. ఇవన్నీ విన్నాకా . సలహా ఇస్తుందా?ఈ క్షణాన బాగానే ఉంటుంది.ఇంటి కెళ్ళాక పని చేస్తుందా?

అందుకే " లేదు "అన్నాను.

"కొన్ని ప్రశ్నలు  అడుగుతాను, సూటిగా సమాధానాలు ఇవ్వాలి "

తల ఊపాను. ఆమె ఏదో అడుగుతోంది . నేను ఏం చెప్తున్నానో నాకు తెలీదు.

కానీ నా జవాబులన్నింటికీ ప్రశంసా పూర్వకంగా చూస్తోంది. బాగా చెప్పావ్ అన్నట్లు చూస్తోంది.

పైగా ఆమె స్నేహ పూర్వకంగా నవ్వింది. కాని నేను నవ్వలేదు.పైగా కోపం వస్తోంది. చేతిలో ఉన్నదానితో  ఆమె మొహాన్ని కొట్టాలనిపించింది.

ఆమె ఓ సారి నామొహం వైపు చూసింది. ఇంక చాలు.అంది ఆమె. నేను నవ్వాను.హమ్మయ్య అయిపోయింది. సంతోషం. చాలా రోజుల తరవాత నవ్వాను.

ఓ పది నిమిషాల తరవాత,బయట కూచున్న అమ్మా నాన్నని లోపలికి పిలిచింది. వాళ్ళు చాలా ఆతృతగా డాక్టరునే చూస్తున్నారు. ఆమె చెప్తున్నదంతా శ్రద్ధగా వింటూ అలాగా అన్నట్లుగా చూస్తున్నారు. వాళ్ళ మొహాల్లో కృతజ్ఞత కనిపిస్తోంది.

"మీ అమ్మాయిని స్టడీ చేసాను. అది పేరెంటల్ అబ్సెషన్స్, మొదటినుంచి మీ ప్రెషర్ చాలా ఉన్నట్టనిపిస్తోంది. అందుకే ఈ విధంగా ఉంది. మీరు ఆమెని ఏ విషయంలో కూడా ఫోర్సు చెయ్యకండి. ఆమెకి ఇష్టం లేని పనులు చేయించకండి. అంతే. ఆమె ప్రస్తుతం  డిప్రెషన్ లో ఉంది. సూసైడ్ చేసుకోడానికి ప్రయత్నించిందని అన్నారు. ఆ టెండెన్సీ కూడా ఉన్నట్టుగా ఉంది. అదంతా డిప్రెషన్ మూలంగానే. దీనికి మందులు మొదలు పెడదాం. ఏం పరవాలేదు. ఇంకా ఎక్కువ అవకుండా నేను ప్రయత్నిస్తాను " అని ఆమె తల ఓ పక్కకి వంచి ,ప్రిస్క్రిప్షన్ రాసి నాన్నగారి చేతికిచ్చింది.

దాన్ని ఓ అపూర్వ,అమూల్యమైన  రత్నంలా. గుళ్ళోపూజారి ఇచ్చిన దేవుడి ప్రసాదంలా ఎంతో భక్తితో అందుకున్నారు. వాళ్ళ కళ్ళల్లో కృతజ్ఞత,స్పష్టంగా కనిపిస్తోంది.

" తగ్గి పోతుందా?" ఆశగా అమ్మఅడిగింది.

ఆ ప్రశ్న కన్నాఎందుకొచ్చిందీ అని అమ్మ అడిగితే బావుంటుంది. దానికి సమాధానం,మీరే మీమూలంగానే అని డాక్టరు అంటుంది. కానీ అమ్మ అడగలేదు. కాని ఆవిడ అన్న పేరెంటల్ అబ్సెషన్స్ అన్నదాని అర్థం అదే. దాని అర్థం అమ్మకి తెలిసిందో లేదో ! ఈ ఒత్తిడి అన్నది కూడా వినిపించుకుని ఉండదు. ఆమె అన్నవి సరిగా విని ఉంటే నేనిల్లా అవడానికి కారణం వాళ్ళే అని అర్థం అవుతుంది.

"  ఈ మందులు డిప్రెషన్ కి, ఇవి వాడితే ఆమె మూడ్ ని తగ్గించచ్చు. అది తగ్గితే ఆ కోపం, అరవడం ఏడవడం అవీ తగ్గచ్చు. ఓ పదిహేను రోజుల తరవాత అమ్మాయిని తీసుకురండి " ఇంక వెళ్ళచ్చు అన్న ట్లుగా తల ఊపింది. బయటికి వచ్చాక నాకు చాలా అసంతృప్తిగా ఉంది. ఆమె సరిగా మాట్లాడ లేదనిపించింది. కమర్షియల్ గా అనిపించింది. ఓడాక్టరు పేషెంటు మధ్య ఉండాల్సిన ఆత్మీయత లేదు..

మా వాళ్ళు ఎంత డబ్బిచ్చారో నాకు తెలీదు.నా ఎదురుగా మాట్లాడు కోలేదు.మందులు మెడికల్ షాపులో కొన్నారు.

" నీకేం కాదమ్మా,కొన్నిరోజుల్లో నీకు బాగా అయిపోతుంది.నువ్వు మామూలుగా అయిపోతావు. అదే మాట ఆవిడ కూడా చెప్పారు కదా. నువ్వు విన్నావు కదా " వాళ్ళ గొంతులోని మెత్తదనానికి మళ్ళీ ఏడుపొచ్చింది. ఎందుకో తెలీదు కానీ ఇంటికి వెళ్ళే వరకూ వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉన్నాను.

ఇంటికి వెళ్ళగానే నాన్న ప్రిస్క్రిప్షన్ చూసి, నేను వేసుకోవాల్సిన మందులిచ్చారు. వేసుకున్నాను. కొంచెం పని చేసినట్లయింది. నిద్ర వచ్చింది. పడుకున్నాను. అమ్మా వాళ్ళు కాస్త కుదుట పడ్డారు. టాబ్లెట్లు వేసుకుంటున్నాను. అవి దేనికో తెలీదు,కాని,అమ్మా వాళ్ళ కోసం వేసుకుంటున్నాను.

ఇది వరకూ అయితే ఆ టాబ్లెట్లు దేనికీ అన్న ఇంట్రెస్ట్ ఉండేది. దాన్లో ఉండే లీఫ్ లెట్ ని తీసుకుని,అందులో ఉన్నదంతా చదివేదాన్ని. అది ఏం మాత్రో,దేనికిచ్చారో,ఎలా పని చేస్తుందో. ఇండికేషన్స్, సైడ్ ఎఫెక్ట్స్ ఏంటీ, దానిలోని యాక్టివ్ కాన్స్ టిట్యుయెంట్స్,ఇంగ్రిడియెంట్స్,

ఫార్మకోపియా, ఎప్పుడు తయారు చేసారో,ఎప్పటి లోపుగా వాడాలో,ఆఖరికి ఏ కంపెనీ తయారు చేసిందో కూడా చూసేదాన్ని.ఇవన్నీ చూస్తూంటే నేను ఓ డాక్టరైపోయినట్లు ఫీలైపోయేదాన్ని. సైన్సు స్టూడెంట్ ని కాబోయే డాక్టర్ని,ఇవన్నీ తప్పకుండా తెలుసుకోవాలి అని అనుకునే దాన్ని. ఇప్పుడు అదేంటో ఏమీ చూడడం లేదు..

మర్నాడు పొద్దున్న నాన్న టాబ్లెట్, అమ్మ మంచినీళ్ళు పట్టుకుని రెడీగా ఉన్నారు.

"ఈ టాబ్లెట్లు వేసుకుంటే నాకు మత్తుగా ఉంటోంది " అని అన్నాను.

"మంచిదే ఇన్ని రోజులూ నిద్ర సరిగా లేకనే కదా నీకు ఈ మానసిక సమస్య "

"కానీ పొద్దున్న నిద్ర లేచాకా కూడా ఆ మత్తు అలాగే ఉంటోంది "

"ఇప్పుడు నీకు అదే కావాలి , ఇప్పుడు నీ శరీరానికి, మైండ్ కి విశ్రాంతి కావాలి. అది నిద్ర మూలంగానే వస్తుంది. అయినా ఇది ఎక్కువ రోజులు కాదు,కొన్ని రోజులు మాత్రమే వేసుకోవాలి "

ఎందుకో ఎప్పటిలా వాదించ లేదు. దెబ్బలాడ లేదు. బుద్ధిగా వాళ్ళ మాటలు విన్నాను.

మత్తు నిద్ర. ఎప్పుడు పడుకుంటున్నానో తెలీదు. కానీ, పడుకుంటున్నాను. ఎప్పుడు లేస్తున్నానో తెలీదు. ఏదీ గుర్తుండడం లేదు. ఎక్కడున్నానో తెలీడం లేదు. నేనెవరో తెలీడం లేదు. ఈ అయోమయం నన్ను భయపెట్టేస్తోంది .

ఒక్కొక్కసారి మంచం మీద కాకుండా, మంచం పక్కన కింద పడుక్కుని ఉంటున్నాను. ఎప్పుడు కిందకి వెళ్తున్నానో తెలీదు. కింద నుంచి లేచే ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదు. లేవడానికి ప్రయత్నించినా తొందరగా లేవడం లేదు. అసలు నేను ఓ పంతొమ్మిదేళ్ళ అమ్మాయిలా లేను. ఓ ముసలమ్మలా నాలుగు కాళ్ళమీద పాకుతూ లేస్తున్నాను. ఈ శరీరం నా శరీరంలా లేదు నాకు నేను ఓ అపరిచితురాలిలా ఉన్నాను. ఈ మధ్య ఇదే ఫీలింగ్స్.

ఆ రోజు కూడా అంతే.మోకాళ్ళ మీద పాకుతూ మంచం మీదకి చేరాను. అతి కష్టం మీద నేనెవరో గుర్తుకి తెచ్చుకున్నాను. నా పేరు శృతి. బిఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాను. నేను ప్రస్తుతం హైద్రాబాదులో ఉంటున్నాను.

అంతలో ఏవో మాటలు వినిపించాయి. అవి పక్క గదిలోంచి అని అర్థం అవడానికి చాలా సమయం పట్టింది. ఎవరివా గొంతులు తెలీదు. ఆలోచించాను, ఎవరిదై ఉంటుంది, ఓ పది నిమిషాలకి గుర్తు పట్టాను, అవి అమ్మ నాన్నలది. మంచం పైనే అలా పడుకుని ఉన్నాను.

ఓ టైము లేదు..ఓ డిసిప్లిన్ లేదు. ఎప్పుడంటే అప్పుడు నిద్ర. అయితే ఒక్కటి మాత్రం నిజం. ఈ స్థితి కూడా బావుంది. ఏ ఆలోచనలు లేవు. అంతా శూన్యం . ఓ నల్లటి ముసుగు నా మనసు మీద కప్పేసి నట్లుగా ఉంది. అంతులేనిశూన్యం. ఓ నరికేసిన చెట్టులా పడుకుంటున్నాను. ముద్దులాకూచుంటున్నాను. పక్షవాతం వచ్చినట్టుగా అన్నీ అవయవాలు పని చేయడం మానేసాయి. రాత్రి లేదు పగలూ లేదు. నిద్ర లేకపోతే, మత్తు. రాత్రళ్ళూ ,పగళ్ళూ ఏకం అయిపోయాయి. కర్టెన్లు పూర్తిగా దగ్గరికి జరపడంతో,వెలుగు గదిలోకి రావడంలేదు. చీకటి,మసక మసక వెలుతురుకి నా కళ్ళు అలవాటు పడిపోయాయి. ఇప్పుడు దాన్నే ఇష్టపడుతున్నాను.

ఓ రోజు  అలా ఎంతో సేపు మంచం మీదే పడుకుని ఉండిపోయాను. టైము కూడా చూసుకోడం లేదు. బాత్రూముకెళ్ళాలి . తెలీదు కానీ ఎందుకో బాగా చెమటపట్టింది. మొహం కడుక్కుంటే బావుంటుందనిపించింది, అతి కష్టం మీద లేచాను. కానీ బాత్రూము వరకూ నడవగలనా, అది ఏంటో చాలా దూరంలో ఉన్నట్టనిపించింది. అంత దూరం వెళ్ళడం కష్టం  అనిపించింది .కాని అలాగే నడిచాను. తలుపు పూర్తిగా వేసుకోలేదు.

బాత్రూంలో ఉన్న అద్దంలో మొహం చూసుకున్నాను. కళ్ళు ఎర్రగా బాగా ఉబ్బి వాచినట్లుగా ఉన్నాయి బుగ్గలు,మొహం పెద్దగా ఉంది. చాలా  భయంకరంగా ఉన్నాను. ఆ బింబం నా మొహంలా లేదు. ఎవరో. నేను కాదు. నా మొహం ఎప్పుడూ ఇలా లేదు. ఏంటో జిడ్డుగా చిరాగ్గా అనిపించింది. స్నానం చెయ్యాలనిపించింది.

అంతే  షవరు తిప్పి,దాని కింద నుంచున్నాను. అలా చాలా సేపు ఉన్నాను. పక్కనే ఉన్నఅద్దం ముందు నుంచున్నాను. ఎర్రగా ఉన్న కళ్ళు, తడిసిపోయిన జుట్టు ,మొహాన ,భజాలమీదా ఇనప ఊసల్లా జారుతూ మెరుస్తున్నాయి.

ఎప్పుడు వచ్చిందో అమ్మవచ్చింది.ఆశ్చర్యంగా చూసింది.

"ఏదో కుళాయి శబ్ధం వస్తూంటే,సడన్ గా మెలకువ వచ్చింది. మా బాత్రూంలో ఏమైనా పొరపాటున తిప్పి ఉంచేసామా అని పరుగున బాత్రూం లోకి వెళ్ళిచూసాను. మామూలుగానే ఉంది మా దగ్గర కాదు. అప్పుడు నీ గదిలోకి వచ్చి చూసాను. నువ్వు మంచం మీద లేవు బాత్రూం లో ఉన్నావు.   ఏం అవుతోంది?  ఇంత రాత్రి వేళ స్నానం ఏంటీ?  టైమెంతో తెలుసా ?  కాస్సేపైతే తెల్లారిపోతుంది " అంటూ గబగబా ఓ పెద్ద తువ్వాలు తీసి నాకిచ్చింది

"సుబ్బరంగా ఒళ్ళు ఒత్తుకుని ఈ నైటీ వేసుకుని రా,నేనిక్కడే ఉంటాను. " అంటూ తలుపుని దగ్గరగా వేసి బయటికి వెళ్ళింది.

నేను బయటికి వచ్చాకా నన్ను చూసి చేతిలో ఉన్న పలచటి తువ్వాలుతో దగ్గరికి వచ్చింది.

"అయినా ఈ అర్థరాత్రి తల స్నానం ఏంటీ? " ఇంకా ఏదో అనబోయింది.

అంతలో నాన్న కూడా వచ్చారు.ఇద్దరూ నా గురించి మాట్లాడుకున్నారు.

“ పిచ్చి ఎక్కువైందా? “ అని అమ్మ మెల్లిగా నాన్నతో అంది.

”మాట్లాడకు ” అన్నట్లు నాన్న సైగ చేసారు. నాకు పిచ్చెక్కిందా !?

”జుట్టు ఆరాక పడుకోకు కూచో ” అంటూ నా భుజం తట్టి వెళ్ళిపోయారు.

అమ్మ నన్నుఫాన్ కింద కూచోపెట్టి, తలని తుడిచింది. స్నానం చేసాకా కొంచెం పరవాలేదు. ఫ్రెష్ గా అనిపిస్తోంది. తడి జుట్టుని గాలికి వదిలేసాను. వెళ్ళి బాల్కనీలో కూచుని,అన్ని వైపులా చీకటి. అవును మరి అర్ధరాత్రి అని అమ్మఅంది కదా. ఆ చీకట్లోంచే బయటికి చూస్తున్నాను. ఇక్కడ కూచుని ఇవన్నీ ఎప్పుడో చూసినట్లనిపిస్తోంది. ఎప్పుడో గుర్తు రావడం లేదు.

బయట చూస్తూంటే అన్నీ తెలిసినట్లే ఉంటోంది. కాని ఏం తెలీడం లేదు. ఆలోచనలు కూడా అంతే ఆలోచిస్తూనే ఉన్నాను. ఈ ఆలోచనలు నావి కావు. అందుకే తప్పులు అలా జరిగి పోతున్నాయి. అలాగే

ఉన్నాయి. ఇదివరకే నయం కాస్త బుర్ర పనిచేసేది. కవిత్వం రాసేదాన్ని. అప్పుడప్పుడు బొమ్మలు గీసేదాన్ని. ఇప్పుడదేం లేదు. ఇప్పుడు నేనేం చెయ్యాలో తెలీడం లేదు. మళ్ళీ నొప్పి, భరించలేని నొప్పి.తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నా చాలా కష్టంగా ఉంది.

నేను కూచోడం చూసిన అమ్మ ,తను కూడా ఓ కుర్చీ తెచ్చుకుని నా ఎదురుగా కూచుంది

“ చలిగాలి వీస్తోంది. పైగా తల స్నానం కూడా చేసావు. జలుబు చేస్తుంది ,లోపలికి వచ్చెయ్యి ”

“ ఎలా ఉంది శృతీ.ఇప్పుడు కాస్త నయంగా ఉందా? సుబ్బరంగా స్నానం చేసావు, మొహం నీటుగా ఉంది. ఇప్పుడు కూడా మత్తుగా ఉందా? కొంచెం టీ తేనా? ” ఎంతో నెమ్మదిగా,అడిగింది.

తలని అడ్డంగా ఊపాను.ఇద్దరం ఇశ్శబ్ధంగా అలాగే కూచున్నాం.

ఇదివరకూ ఇలా కాదు,నన్ను చూడగానే,టీ తాగేసి చదువుకో , అని ఓ అధికారంతో అనేది అమ్మ. అమ్మ బాగా మారింది. అని అనుకున్నాను.

“బాగానే ఉంది” అని అన్నాను.

“అయితే గుడికి వెళ్దామా. ధనుర్మాసం కదా తెల్లారు ఝామునే గుడి తెరిచేస్తారు . అభిషేకాలు అవీ చేస్తున్నారు. చూసొద్దాం ”

“నాకు ఎక్కడికీ రావాలని లేదు ” కోస్త విసుగ్గానే అన్నాను. అమ్మ అర్థం చేసుకుంటుందని అనుకున్నాను. కానీ లేదు. నాదగ్గరికి వచ్చి,నా మొహంలోకి చూసింది.

“ ఒక్క పది నిమిషాలు అవి అన్నీ చూసి వచ్చేద్దాం. బావుంటుంది. ఏం...సరేనా...? ”

"ఎన్ని సార్లు చెప్పాలీ, నేను రానంటే వినిపించుకోవేంటీ, నేను రాను,రాను,రానూ.అంతే. నన్ను వదిలెయ్యి. నీకంతగా వెళ్ళాలని ఉంటే నువ్వు వెళ్ళు" గట్టిగా కోపంగా అన్నాను. అమ్మ భయపడింది. గబుక్కున కుర్చీలోంచి లేచి , కళ్ళు పెద్దగా చేసి నన్నే చూస్తోంది.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments